# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 97 EDITOR:CHERUKU UPENDAR, DATE : AY 10 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 97 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 10 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## గుజరాత్ నుంచి రాహుల్ జోడో యాత్ర

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



రెండో విడత 'భారత్ జోడో యాత్ర' కు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తొలి విడతలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కొనసాగిన విషయం తెలిసిందే. రెండో విడత 'భారత్ జోడో యాత్ర' కు రంగం

మిగతా 2లో...

## మణిపూర్‌లో భరతమాతను చంపేశారు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఎంపీ సభ్యత్వం పునరుద్ధరించిన తరవాత రాహుల్ గాంధీ తొలిసారి పార్లమెంట్‌లో ప్రసంగించారు. తన సభ్యత్వాన్ని రీస్టోర్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదానీ వ్యవహారంపై మాట్లాడనంటూ బీజేపీపై సెటైర్లు వేశారు. ఇదే క్రమంలోనే అవిశ్వాస తీర్మానంపై మాట్లాడిన రాహుల్ గాంధీ... ముందుగా భారత్ జోడో యాత్ర గురించి మాట్లాడారు. తన యాత్ర ఇంకా ముగిసిపోలేదని, రెండోసారి యాత్ర నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు." లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించినందుకు స్పీకర్ గారికి ధన్యవాదాలు. నేను చివరిసారి మాట్లాడినప్పుడు మిమ్మల్ని బాగా ఇబ్బంది పెట్టి ఉంటాను. ఎందుకంటే నేను అప్పుడు అదానీ వ్యవహారంపై

మిగతా 2లో...

## ఈ నెలాఖరుకే.. అభ్యర్థులు



### మూడు పార్టీలు ముమ్మరంగా కసరత్తు
### అసెంబ్లీ ఎన్నికలకు సమీపిస్తున్న గడువు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తోంది. నవంబర్ మూడో వారం నుంచి డిసెంబర్ రెండో వారం మధ్యలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. ఈ లెక్కన ఇంకా మూడు నెలల గడువు వుంది. రాష్ట్రంలో ఎన్నో రాజకీయ పార్టీలున్నా మూడు పార్టీలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. అధికార భారత రాష్ట్ర సమితిని ఢీ కొనేందుకు కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు సమా యత్తమవుతున్నాయి. విపక్షాలను ఎదుర్కొనేందుకు తన దగ్గర ఇంకా ఎన్నో అస్త్రాలున్నాయని తాజాగా ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు ఇటీవల అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఇదివరకే పలు డిక్లరేషన్లను ప్రకటించి ఓటర్లకు వరాలను ప్రకటించింది. ప్రియాంక గాంధీ వస్తే మహిళా డిక్లరేషన్ వెల్లడించేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతున్నారు. మహిళా డిక్లరేషన్‌లో కర్నాటకలో ప్రకటించినట్లుగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని తాయిలంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. అధికార బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూనే సంక్షేమం పేరిట వరాల జల్లు కురిపిస్తోంది. మొన్నటి వరకు మూడు వేల రూపాయలుగా వున్న దివ్యాంగుల పెన్షన్‌ని రూ. 4,016కు పెంచారు. 43 వేల ఆర్టీసీ కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపుతూ వారి చిరకాల కోరికను తీర్చింది. టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చింది కేసీఆర్ సర్కార్. మరోవైపు లక్షల్లో వున్న ప్రభుత్వ ఉద్యోగులను మచ్చిక చేసుకునేందుకు త్వరలో వేతన సవరణ సంఘాన్ని (పీఆర్సీ)ని వేయనున్నట్లు సీఎం వెల్లడించారు. అయితే, పీఆర్సీ నివేదిక వచ్చేలోగా సమయం పడుతుంది కాబట్టి ఎన్నికలకు ముందే మధ్యంతర ఉపశమనం (ఐ.ఆర్.)ని ప్రకటిస్తామని కూడా చెప్పేశారు. ఇలా ఎన్నికలే లక్ష్యంగా సీఎం ఓట్ల వేటకు సిద్ధమవుతున్నారు.

మిగతా 3 లో...

బిసి బిల్లు కై పార్లమెంట్ వద్ద బీసీ ల భారీ ప్రదర్శన?

## జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

పార్లమెంట్ లో బిసి బిలు పెట్టాలని ,బి.సి లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పిం చాలని, బిసి బర్జేట్ ను2 లక్షల కోట్లకు

మిగతా 2లో...

## మారిపోయిన వాసలమర్రి

### శరవేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

నల్గోండ- ప్రభాత సూర్యుడు



వాసాలమర్రి పేరు గుర్తుందా... అదే నండి కేసీఆర్ దత్తత గ్రామం.. ఇప్పుడు శరవేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు దత్తత తీసుకోవడంతో ఈ గ్రామం రూపు రేఖలు మారుతున్నాయ. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్టు 2020 నవంబర్ 1న సీఎం కేసీఆర్ ప్రకటించారు. 2021 జూన్ 22న వాసాలమర్రిలో గ్రామసభ నిర్వహించి గ్రామ సమస్యలను అడిగి తెలుసు కున్నారు. గ్రామంలోని దళితవాడలో పర్యటించి దళితుల ఇళ్లను పరిశీలించి స్థానికులతో సహపంక్తి భోజనం చేశారు. వాసాలమర్రి అభివృద్ధికి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ ను స్పెషల్ ఆఫీసర్ గా సీఎం కేసీఆర్ నియమించారు. గ్రామంలోని పూరి గుడిసెలు పురాతన ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ లేఅవుట్ తయారు చేసి విశాలమైన రోడ్లతో పాటు కమ్యూనిటీ, అంగన్‌వాడీ భవనం, ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కమర్షియల్

మిగతా 2లో...

## మామ తరపున బన్నీ ప్రచారం



నల్గోండ- ప్రభాత సూర్యుడు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనేందుకు స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ సిద్ధమవుతున్నారు. అల్లు అర్జున్‌కు పిల్లను ఇచ్చిన మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 19 నుంచి ఎన్నికల కార్యకలాపాలకు శ్రీకారం చుట్టాలని చంద్రశేఖర్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారు. ఇందులోభాగంగానే తన అల్లుడైన ప్రముఖ సినీనటుడు అల్లుఅర్జున్ రంగంలోకి దింపుతున్నారు. నియోజ కవర్గంలో తన రాజకీయ

మిగతా 3లో...

## చిరు ప్రకటనలతో ప్రకంపనలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై చిరంజీవి చేసిన వ్యాఖ్యలు రాజకీయచర్చకు దారితీశాయి. ఇప్పటివరకూ జనసేన పార్టీ గురించి గానీ పవన్ కళ్యాణ్ గురించి గానీ పెద్దగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు చిరంజీవి. ఏపీ ప్రభుత్వం సినిమా టిక్కెట్ ధరల పెంపు సమయంలో కూడా సినీపరిశ్రమ పెద్దగా అమరావతి వచ్చిన చిరంజీవి? ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తో ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ఆ తర్వాత కూడా ఒకసారి సీఎం జగన్ తో భేటీ అయ్యారు మెగాస్టార్. పవన్ విషయంలో జోక్యం చేసుకోకపోవడం,సీఎం జగన్ తో భేటీలతో ఏపీ ప్రభుత్వానికి చిరంజీవి దగ్గరగా ఉన్నారనే చర్చ

మిగతా 2లో...

## ఐటీ టవర్ ప్రారంభం

### ఉద్యోగులతో మాట్లాడిన కేటీఆర్

నిజామాబాద్-- ప్రభాత సూర్యుడు




నిజామాబాద్ ఐటీ టవర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం ఐటీ హబ్‌ను పరిశీలించారు. కొత్తగా రిక్రూట్ అయిన ఉద్యోగులతో కాసేపు ముచ్చటించారు. రూ.50 కోట్లతో మొత్తం 49,460 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఆకట్టుకునే రీతిలో ఈ ఐటీ టవర్‌ను నిర్మించారు. ఖాఎఎఅ ద్వారా ప్రభుత్వం మౌలిక సదుపాయాలు మరియు అత్యాధునిక సౌకర్యాలను కల్పించింది. ఐటీ కంపెనీల ఏర్పాటుకు వెళ్తున్న వారంతా ఐటీ శాఖతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను టాస్క్ ఆధ్వర్యంలో జూలై 21న నిర్వహించారు. వేలాది మంది తరలిరావడంతో ఐటీ కంపెనీలు నైపుణ్యం ఉన్న వారిని రిక్రూట్ చేసుకుంటున్నాయి. మొత్తం 49,460 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆకట్టుకునే రీతిలో నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో సహా మూడు అంతస్తులతో నిర్మాణం పూర్తయింది. ఎకరం స్థలంలో ఐటీ టవర్‌ను డిజైన్ చేశారు. మిగిలిన 2.5 ఎకరాల స్థలంలో

మిగతా 2లో...

## ఐఐటీలో ఆగని ఆత్మహత్యలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఐఐటీ హైదరాబాద్‌లో మరో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు ఎవరూ కారణం కాదంటూ సూసైడ్ లెటర్ రాసి హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. వివరాల్లోకెళ్తే.. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన విద్యార్థిని మమైత నాయక్ ఎంటెక్ చదువుతుంది.

మిగతా 3లో...

# గుజరాత్ నుంచి రాహుల్ జోడో యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తొలి విడతలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కొనసాగిన విషయం తెలిసిందే. రెండో విడతలో ఈ భారత్ జోడో యాత్ర గుజరాత్ నుంచి ప్రారంభమై మేఘాలయ వరకు కొనసాగనుంది. ఈ విషయాన్ని మహారాష్ట్ర కాంగ్రెస్ నేత నానా పటోలే వెల్లడించారు. రెండో విడత భారత్ జోడో యాత్రకు సమాంతరంగా మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ పాద యాత్ర నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.రాహుల్ గాంధీ రెండో విడత భారత్ జోడో యాత్రను చేపట్టనున్నారన్న విషయాన్ని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జై రామ్ రమేశ్ వెల్లడించారు. ఈ యాత్ర గుజరాత్ లో మహాత్మా గాంధీ జన్మస్థలమైన పోర్ బందర్ నుంచి ప్రారంభమవుతుందని, అరుణాచల్ ప్రదేశ్ లోని పాసిఘాట్ వరకు ఈ యాత్ర కొనసాగుతుందని ఆయన గతంలో ప్రకటించారు. అయితే, రెండో విడత పాదయాత్రపై ఆ తరువాత పార్టీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇప్పుడు కూడా పార్టీ అగ్ర నాయకత్వం నుంచి కాకుండా, మహారాష్ట్ర లో కాంగ్రెస్ నాయకుడు నానా పటోలే నుంచి ఈ సమాచారం బయటకు రావడం విశేషం. అయితే, ఈ యాత్ర ఎప్పుడు ప్రారంభమవుతుంది?, ఏ రాష్ట్రాల నుంచి వెళు ంది?, ఎక్కడ ముగుస్తుంది? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఈ వివరాలతో పాటు పాద యాత్ర రూట్ మ్యాప్ పై కాంగ్రెస్ పార్టీలో కసరత్తు కొనసాగుతున్నట్లు సమాచారం.తొలి విడత భారత్ జోడో యాత్ర గత సంవత్సరం సెప్టెంబర్ లో దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల గూండా 130 రోజులకు పైగా 4 వేల కిలోమీటర్లకు పైగా ఈ పాదయాత్ర కొనసాగింది. చివరకు జమ్మూ కశ్మీర్ లోని శ్రీనగర్ లో ముగిసింది. ఈ యాత్రలో వివిధ ప్రాంతాలు, వర్గాలు, సామాజిక నేపథ్యాలున్న ప్రజలతో రాహుల్ గాంధీ మమేకమయ్యారుగుజరాత్ నుంచి రాహుల్ గాంధీ తన రెండో విడత భారత్ జోడో యాత్ర ను ప్రారంభించాలని కోరుతున్నామని, ఆయనకు స్వాగతం చెబు తున్నామని గుజరాత్ కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ ల గడ్డ నుంచి ఈ యాత్ర ప్రారంభం కావాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. 'రెండో విడత యాత్ర గుజరాత్ నుంచే ప్రారంభం కావాలి. ఈ విషయంపై పార్టీ అగ్ర నాయకత్వం కసరత్తు చేస్తోంది' అని గుజరాత్ కాంగ్రెస్ నేత అమిత్ చావ్డా వెల్లడించారు.

# జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

పెంచాలని, కేంద్రం లో బి.సి లకు ప్రతేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో గుజ్జ సత్యం జాతీయ ఉపాధ్యక్షులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం మరియు లాల్ కృష్ణ తెలంగాణ కన్వీనర్ అధ్యక్షతన బీసీ లు మహా ధర్నా నిర్వహించారు. వైయస్సార్సీపి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు అతిధిగా హాజరయ్యారు .తెలుగు రాష్ట్రాలనుండి వందలాది మంది వివిధ బిసి సంఘాలు, అనుబంధ సంఘాలకు చెందినా కార్యకర్తలు హాజరైనార్టు.అంతకు ముందు పార్లమెంటు వద్ద ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ ఎత్తున పోలిసు బలగాలను మోహరించారు.ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఆర్, కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ - పార్లమెంట్ ఎన్నికలలో బి సి లకు అన్ని రాజకీయ పార్టీలు బి సి లకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. బి.సి లకు అన్యాయం చేసే పార్టీల బరతం పడతామని హెచ్చరించారు.అన్ని రాజకీయ పార్టీలు బి సి లను ఓటు బ్యాంకు గా వాడుకుంటున్నారు. రాజ్యాధికారంలో వాట ఇవ్వకుండా 75 సం.లుగా అన్యాయం చేస్తూన్నారు. జెండాలు మోసుకుంటు, జిందాబాద్ ల నినాదాలు ఇస్తూ బిసిలను వాడుకుంటున్నారని విమర్శించారు. బి సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని,త్వరలో జరుపబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలని డిమాండ్ చేసారు.అలాగే బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలని,బి.సి ల విద్య - ఉద్యోగ రిజర్వేషన్లు పై యున్న క్రిమిలేయర్ ను తొలగించాలని డిమాండ్ చేసారు.. బి.సి లకు పారిశ్రామిక పాలసీ లో 50 శాతం కోటా ఇవ్వాలని. హై కోర్టు - సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో ూఅ/ూు/ఃఅ- రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని,ప్రైవేటు రంగం లో ూఅ/ూు/ఃఅ లకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసారు. ఈ మహా ధర్నాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం,తెలంగాణా రాష్ట్ర కాన్వినర్ లాల్ కృష్ణ, బిసి విద్యార్థి సంఘం తెలంగాణా అద్యక్షులు అంజి, బిసి ఐక్యవేదిక అద్యక్షులు అనంతయ్య, ఢిల్లీ ఇంచార్జ కర్రి వేనుమాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్ మరియు తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జలపల్లి కిరణ్, హైదరాబాద్ గ్రేటర్ ఉపాధ్యక్షులు పండరినాథ్, రఘుపతి

# మణిపూర్‌లో భరతమాతను చంపేశారు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడాను. బహుశా మీ సీనియర్ లీడర్ (ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ) బాధ పడ్డారేమో. బహుశా ఆ బాధ మీపైన (స్పీకర్‌ని ఉద్దేశిస్తూ) కూడా ప్రభావం చూపించి ఉండొచ్చు. అందుకు నేను మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. కానీ నేను మాట్లాడింది నిజం. కానీ ఈ సారి బీజేపీ మిత్రులు ఏం భయపడాల్సిన పనిలేదు. నేను ఇప్పుడు అదానీ గురించి మాట్లాడడం లేదు"రాహుల్ ప్రసంగిస్తుండగా బీజేపీ ఎంపీలు గట్టిగా నినాదాలు చేశారు. ఆ సమయంలో రాహుల్ రూమీ కొటేషన్‌ని ప్రస్తావించారు. "మనసులో నుంచి వచ్చే మాటలు ఎప్పుడూ...మనసుని తాకుతాయి" అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

అవిశ్వాస తీర్మానాన్ని ప్రస్తావిస్తూ మణిపూర్ అంశంపై మాట్లాడారు రాహుల్ గాంధీ. మణిపూర్ రాష్ట్రాన్ని దేశంలో భాగంగా మోదీ సర్కార్ చూడడం లేదని విమర్శలు చేశారు. తాను మణిపూర్‌కి వెళ్లి అక్కడి బాధితులను పరామర్శించానని, ప్రధాని మోదీ మాత్రం ఇప్పటి వరకూ ఆ పని చేయలేదని విమర్శించారు. "ప్రధాని మోదీకి మణిపూర్ మన దేశంలోని భాగం కాదు. ఆ రాష్ట్రాన్ని మోదీ సర్కార్ ముక్కలు చేసింది" అంటూ విరుచుకు పడ్డారు. మణిపూర్‌లో భారత్‌ని హత్య చేశారంటూ తీవ్రంగా విమర్శించారు. మణిపూర్‌లో పర్యటించినప్పుడు చాలా మంది బాధితులను ఓదార్చినట్టు వెల్లడించారు రాహుల్ గాంధీ. కళ్లముందే భర్తను కాల్చి చంపినట్టు ఓ బాధితురాలు తనతో చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నట్టు వివరించారు. ప్రధాని మోదీని రావణాసురుడితో పోల్చారు రాహుల్. ఆయన అదానీ, అమిత్‌షా మాటలు తప్ప ఇంకెవరి మాటల్నీ వినిపించుకోరని అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీకి మణిపూర్ మన దేశంలో భాగంగానే కనిపించడం లేదు. ఆ రాష్ట్రంలో ఇండియాని బీజేపీ హత్య చేసింది. మణిపూర్ రెండు ముక్కలుగా చీలిపోయిందనేది వాస్తవం.

అసలు ఇప్పుడా రాష్ట్రం ఉనికే కనిపించడం లేదు. బీజేపీ ఎంపీలు మమ్మల్ని రాజస్థాన్‌కి వెళ్లమని సలహా ఇచ్చారు. నేను వెళ్తున్నాను. ప్రధాని మోదీ రావణాసురుడిగా మారిపోయారు. మొత్తం దేశాన్ని తగలబెడుతున్నారు. ముందు మణిపూర్‌తో మొదలు పెట్టారు. ఇప్పుడు హరియాణాలో ఇదే జరుగుతోంది. దేశం మొత్తాన్ని ఇలా తగలబెట్టాలనుకుం టున్నారు"భరత మాతపై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నోరు జారకూడొద్దంటూ మందలించారు. ఇటీవల తాను దేశం ఒక మూల నుంచి మరో మూలకు పాదయాత్ర చేశానంటూ భారత్ జోడో యాత్ర గురించి చెప్పుకొచ్చారు. పాదయాత్ర ఎందుకు చేస్తున్నావని చాలామంది అడిగారు.. అయితే తాను కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేయడం వెనుక మీ లక్ష్యం ఏంటని అడిగారు. భారత దేశాన్ని అర్థం చేసుకునేందుకు, ప్రజలకు కలిసేందుకు పాదయాత్ర చేయాలనుకున్నాను అంటూ చెపాను.. అయితే తన పాదయాత్ర పూర్తి కాలేదని.. ఇక ముందు కూడా భారత్ జోడో యాత్ర కొనసాగుతుందన్నారు రాహుల్ గాంధీ.పాదయాత్ర ప్రారంభించిన మొదట్లో తనకు అహంకారం ఉండేదని గుర్తుచేసుకున్నారు. పాదయాత్ర కొనసాగుతున్న కొద్దీ తనలో అహంకారం క్రమంగా మాయమైందన్నారు. పాదయాత్రలో రోజూ విభిన్న రంగాల వారిని కలిశానంటూ చెప్పుకొచ్చారు.. సామాన్యులను, ధనవంతులను, వ్యాపారులను.. ఇలా అన్ని వర్గాలను కలిశాను. అందరితో కలుస్తూ.. అందరి మాటలు వింటూ పాదయాత్ర కొనసాగించా.. నేను నమ్మిన సత్యం కోసం జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని అన్నారు రాహుల్.రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై గందరగోళంరాహుల్ గాంధీ ప్రసంగంపై బీజేపీ సభ్యుల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకుంటున్న బీజేపీ సభ్యులు ప్రయత్నించారు. కొన్నిరోజుల క్రితం తాను మణిపుర్ వెళ్లినట్లుగా చెప్పారు. ప్రధాని మోదీ ఇప్పటి వరకు మణిపుర్ వెళ్లలేదన్నారు. మణిపుర్ పునరావాస శిబిరాల్లోని మహిళలు, పిల్లలతో తాను మాట్లాడిన విషయాన్ని గుర్తు చేసుకున్నట్లుగా చెప్పారు. మణిపుర్ బాధితులకు మద్దతుగా తాను రాత్రంతా వారితో గడిపానంటూ.. ఆ మహిళ చెప్పిన విషయాన్ని సభ ముందు పెట్టారు.మన సైన్యం తలచుకుంటే మణిపుర్‌లో ఒక్కరోజులోనే శాంతి సాధ్యం..కానీ ప్రభుత్వం అలా ఆలోచించడం లేదంటూ విమర్శించారు రాహుల్ గాంధీ.భరత మాతపై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నోరు జారకూడొద్దంటూ మందలించారు.కేంద్రమంత్రి స్మృతి ఇరానీ కూడా రాహుల్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భరత మాతపై రాహుల్ అలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ ఎంపీలు చప్పట్లు కొట్టడం సిగ్గు చేటు అంటూ మండి పడ్డారు. ఆ పార్టీ వైఖరేంటో దీంతో తేలిపోయిందని తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. "మీరు ఇండియా కానే కాదు. అవినీతిని మొదలు పెట్టిందే మీరు. ప్రస్తుతం దేశ ప్రజలు వారసత్వ రాజకీయాలను కాదు అభివృద్ధిని విశ్వసిస్తున్నారు. మీ లాంటి వాళ్లు క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తు చేసుకోవాల ని అన్నారు.

### రాహుల్ కు స్మృతి ఇరానీ కౌంటర్

మణిపూర్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ బుధవారం లోక్‌సభలో కౌంటర్ ఇచ్చారు. భారత హత్య' అంటూ పార్లమెంటులో ఒకరు మాట్లాడడం ఇదే తొలిసారి అని, సభలో రాహుల్ గాంధీ తీరును తాను ఖండిస్తున్నానని ఇరానీ ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో బీజేపీ భరత్‌ను హత్య చేసిందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ హత్య అంటే కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరుస్తున్నారని మండిపడ్డారు. మణిపుర్ మన దేశంలో భాగం.. ఎవరూ విడదీయలేరని స్మృతి ఇరానీ అన్నారు. దేశంలో అవినీతిని పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీయే అంటూ విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు యూపీఏ హయాంలో చాలా జరిగాయన్నారు. రాజస్థాన్ బాలికపై గ్యాంగ్ రేప్ చేసి.. ముక్కలుగా నరికేశారని.. ఆర్టికల్ 370 రద్దు వల్లనే రాహుల్ పాదయాత్ర చేయగలిగారని గుర్తు చేశారు. ఆర్టికల్ 370 మళ్లీ తెస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. కశ్మీర్ పండితులకు జరిగిన అన్యాయాలు రాహుల్‌కు కనిపించవా.. అంటూ స్మృతి ఇరానీ ప్రశ్నించారు. కశ్మీర్ మహిళలకు జరిగిన అన్యాయాలు రాహుల్‌కు కనిపించవా అంటూ మండిపడ్డారు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ.మణిపూర్‌లో హింసాకాండపై బిజెపికి వ్యతిరేకంగా దాడి చేసిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ఈశాన్య రాష్ట్రంలో తమ రాజకీయాలు భారత్ హత్య చేశారని, అధికార పార్టీ సభ్యులను "ద్రోహులు" అని ఆరోపించారు. మీరు భారతదేశం కాదు.. భారతదేశం యోగ్యతను నమ్ము తుంది. రాజవంశాలను కాదు, ఈ రోజు మీలాంటి వారు బ్రిటిష్ వారికి చెప్పిన వాటిని గుర్తుంచుకోవాలి ? క్విట్ ఇండియా. అవినీతి క్విట్ ఇండియా, రాజవంశం క్విట్ ఇండియా. మెరిట్ ఇప్పుడు ఇండియాలో చోటు దక్కించుకుంది?" అని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు.2019 ఎన్నికల సమయంలో అమేథీ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ నేతను ఓడించిన స్మృతి ఇరానీ రాహుల్ గాంధీ ప్రసంగంపై స్పందిస్తూ.. 'భారత్ హత్యపై రాహుల్ గాంధీ మాట్లాడినప్పుడు కాంగ్రెస్ నేతలు చప్పట్లు కొట్టడం, డెస్కులు కొట్టడం దేశం మొత్తం చూసింది' అని అన్నారు.స్మృతి ఇరానీ కూడా 2019లో జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేయడాన్ని స్మృశించారు మరియు యథాతథ స్థితి కొనసాగుతుందని చెప్పారు.

# మారిపోయిన వాసలమర్రి

(మొదటిపేజీ తరువాయి)

కాంప్లెక్స్, ఆట స్థలం, సెప్టిక్ ట్యాంకులను ఆధునిక హంగులతో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. దేశానికే రోల్ మోడల్ గా వాసాలమర్రిని తీర్చిదిద్దేందుకు 152 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.సీఎం కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ రూపురేఖలను మార్చనున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాల నిర్మాణానికి మొత్తం రూ.3.58 కోట్లు, మూడు అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు రూ.75 లక్షలు కేటాయించారు. అదనంగా ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించారు.గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 30 లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుత ఈ పనులన్నీ ప్రారంభమై భవన నిర్మాణాల పనులు కొనసాగు తున్నాయి. వాసాలమర్రి గ్రామానికి మాత్రమే కాకుండా పరిసర గ్రామాలైన కొండాపురం, తిరుమలాపురం, గోపాల పూర్, శ్రీనివాసపూర్ లకు కూడా విద్యుత్ ను అందించేందుకు మూడు కోట్ల రూపాయలతో చేపట్టిన

33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తైంది.వాసాలమర్రిలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధితో పాటు గ్రామస్తులందరికీ వారి వారి స్థానాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే గ్రామంలోని 103 పక్కా ఇళ్లు, మరో 481 పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు, గుడిసెలను కూల్చివేసి వాటి స్థానంలో పక్కా ఇళ్లను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. విశాలమైన రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం కూడా అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ఇళ్ల నిర్మాణంతోపాటు మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం దృష్టి సారించింది.సీఎం కేసీఆర్ ఆదేశాలతో గ్రామంలో ఇప్పటికే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని గ్రామ సర్పంచి ఆంజనేయులు చెబుతున్నారు. సీఎం కేసీఆర్ తమ గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో గ్రామ రూపురేఖలే మారుతున్నాయని, మాస్టర్ ప్లాన్ పూర్తయితే దేశానికే వాసాలమర్రి రోల్ మోడల్ గా నిలుస్తుందని సర్పంచ్ చెబుతున్నారు.

# చిరు ప్రకటనలతో ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

అప్పట్లో జోరుగా సాగింది. ఒకవైపు పవన్ కళ్యాణ్ ఏపీ ప్రభుత్వం పై,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసినా?అటు పవన్ పై మంత్రులు, వైసీపీ నేతలు మాటల దాడి చేసినా ఏ మాత్రం తనకు పట్టదన్నట్లు వ్యవహరించారు చిరంజీవి. జనసేన పార్టీతో నాగబాబు మాత్రమే ఉన్నారని?చిరంజీవి రాజకీయంగా దూరంగా ఉన్నారని అందరూ భావించారు. తమ్ముడు పవన్ కళ్యాణ్ వ్యవహారంలో ఆచితూచి అడుగులు వేస్తున్న చిరంజీవి?ఒక్కసారిగా ఏపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి మాట్లాడటం పెద్ద చర్చగా మారింది. మళ్లీ చిరంజీవి తన తమ్ముడు పవన్ కు దగ్గరయ్యారా? జనసేనకు చిరంజీవి మద్దతు ఉంటుందా అని రాజకీయవర్గాల్లో చర్చ ఊపందుకుంది.చిరు కామెంట్స్ తో మారుతున్న రాజకీయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ఉన్నట్టుండి చిరంజీవి ఎందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేసారనేది సస్పెన్స్ గా మారింది. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అన్నట్లు సినిమా పరిశ్రమపై ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని చిరంజీవి వ్యాఖ్యానించారు. అంతే కాదు ప్రత్యేక హోదా తీసుకురండి, రోడ్లను బాగుచేయండి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు చిరంజీవి. వాల్తేర్ వీరయ్య సినిమా 200 రోజుల వేడుకలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలతో ఏపీలో రాజకీయం మారుతుందని చర్చ జరుగుతోంది.

బ్రో సినిమా వివాదంతో పవన్ కళ్యాణ్ రెన్యూమరేషన్ అంశం తెరపైకి వచ్చింది. తనను సినిమాలో కించరిచేలా చూపించారంటూ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. సినిమా ఖర్చులు,హీరో పవన్ కళ్యాణ్ రెన్యూమరేషన్ బయటపెట్టాలని డిమాండ్ చేసారు. పవన్ కు చంద్రబాబు దగ్గర నుంచి వచ్చిన బ్లాక్ మనీని సినిమా రూపంలో వైట్ మనీగా అందజేశారని నిర్మాత పైనా ఆరోపణలు చేశారు మంత్రి అంబటి రాంబాబు. పవన్ కళ్యాణ్ రోజుకు రెండుకోట్లు పారితోషికం తీసుకుని ఆయన బాగుపడ్డారని? సినిమాను కొన్న ఎగ్జిబిటర్లు మాత్రం నష్టపోయారని అంబటి రాంబాబు ఆరోపించారు. బ్రో సినిమాకు వ్యతిరేకంగా బ్రో అనే సినిమా తీస్తానని చేసిన వ్యాఖ్యలతో అంబటి రాంబాబు ? జనసేన మధ్య సినిమా రాజకీయం తీవ్ర స్థాయిలో నడిచింది. అలా మొదలైన రాజకీయం కాస్తా.. చిరంజీవి ఏపీ ప్రభుత్వంపై విమర్శలు చేసే వరకూ వెళ్ళింది. చిరు చేసిన వ్యాఖ్యలతో ఇకపై జనసేనలో చిరంజీవి కీలక పాత్ర పోషిస్తారని టాక్ కూడా మొదలైంది.చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలతో ఆయన పవన్ కళ్యాణ్ ని సమర్థించారని చర్చ జరుగుతుంది. అందుకే చిరంజీవిపై వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు.అసలు చర్చ తన తమ్ముడు పవన్ కళ్యాణ్ తోనే స్టార్ట్ అయిందంటూ విమర్శలు గుప్పించారు నేతలు. అంతకు ముందు ఎప్పుడూ సినిమా పరిశ్రమపై రాజకీయ పార్టీల నేతలు ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెబుతున్నారు. బ్రో సినిమాలో మంత్రి అంబటి రాంబాబు క్యారెక్టర్ ను కావాలనే సృష్టించి రాజకీయం చేసారని వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు గిల్లితే రెండో వైపు కూడా గిల్లించుకోవలని అంటున్నారు. అసలు చిరంజీవి కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే ప్రత్యేక హోదా అంశాన్ని చట్టంలో పెట్టకుండా అన్యాయం చేశారని గుర్తు చేస్తున్నారు. అప్పుడు చిరంజీవి ఎక్కడున్నారని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి పవన్ కళ్యాణ్ కు మద్దతుగా చిరంజీవి నిలబడటం పై మొదటిసారి చిరంజీవిపై ఏపీ ప్రభుత్వం నుంచి విమర్శలు దాడి స్టార్ట్ అయింది. మరోవైపు చిరంజీవి జనసేన పార్టీలో చేరుతారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చివరికి ఏం జరుగుతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# ఐటీ టవర్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తులో ఐటీ టవర్‌ను విస్తరించే సమయంలో స్థల కొరత రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నారు. నగరంలోని ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం, ఐటీ టవర్ పక్కనే నిర్మించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సెంటర్‌కు జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నామకరణం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.6.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా న్యాక్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ హైటెక్స్ ప్రాంగణంలో ఉండగా, న్యాక్ కేంద్రం జగిత్యాల జిల్లాలో కూడా ఉంది. ఈ ప్రాంత యువతీ, యువకుల కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కూడా న్యాక్ ఏర్పాటు చేశారు. అందులో అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఐదు స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, మూడు లేబొరేటరీలు, 1 కంప్యూటర్ ల్యాబ్, 120 మంది అభ్యర్థులకు వసతి గృహం, 1 కౌన్సెలింగ్ గది, 1 ప్లేస్‌మెంట్ గది, 8 కార్యాలయ గదులు నిర్మించారు. చదువుతో సంబంధం లేకుండా స్వయం ఉపాధిపై ఆసక్తి ఉన్న వారందరికీ న్యాక్ చుక్కాని ఉంటుంది. మేసన్ జనరల్, అసిస్టెంట్ బార్ బెండర్ మరియు స్టీల్ ఫిక్చర్, షట్టరింగ్ కార్పెంటరీ, కన్స్ట్రక్షన్ పెయింటర్ మరియు డెకరేటర్, అసిస్టెంట్ టెక్నీషియన్ డ్రై వాల్ అండ్ ఫాల్స్ ? సీలింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రిసిటీ, ప్లంబర్ (జనరల్), అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ వర్క్ సూపర్‌వైజర్, ఆర్క్ మరియు గ్యాస్ వెల్డర్, అసిస్టెంట్ స్టోర్ కీపర్ మరియు స్టోర్ కీపర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్, టైలరింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వబడుతుంది. భవనం నిర్మాణం ఉ ఖశ్రీబీబ 2 పద్ధతిలో నిర్మించబడింది. ప్రతి అంతస్తు 12,519 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంది, మొత్తం 37,557 చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులో ఉంది.

## సంపాదకీయం

# రాహుల్ కు కలిసొచ్చిన బహిష్కరణ

రాజకీయాల్లో ఏ పరిణామం ఎవరికి ఎలా కలిసొస్తుందో చెప్పలేం. రాత్రికి రాత్రే తలరాతలు మారిపోతూ ఉంటాయి. ఓడలు బండ్లు, బండ్లు ఓడలవుతుంటాయి. ఇదంతా ఎందుకంటే.. పరువు నష్టం వంటి అతి సాదాసీదా కేసులో అనర్హత వేటుకు గురైన రాహుల్ గాంధీ.. సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతో మళ్లీ తిరిగి తన లోక్‌సభ సభ్యత్వాన్ని పొందడం న్యాయపోరాటంలో సాధించిన విజయం మాత్రమే కాదు, అంతకు మించి నైతికంగా, రాజకీయంగా ఆయుధంగా మారింది. హత్యలు, అత్యాచారాల ఆరోపణలు కల్గిన నేతలు చట్టసభల్లో తిష్టవేస్తున్న సమయంలో కేవలం ఓ ఎన్నికల సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల ఆధారంగా జైలు శిక్ష విధించడం రాహుల్‌కు శాపంలాంటి వరంగా మారింది. ఆయన చేసిన వ్యాఖ్యల కంటే.. ఆయనకు విధించిన శిక్ష గురించే దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ఆ మేరకు సానుభూతి కూడా పెరిగింది. పరువు నష్టం కేసులో గరిష్ట శిక్షాకాలం రెండేళ్లు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో కొన్ని నెలలు శిక్షతోనే సరిపెడుతుంటారు. కానీ రాహుల్ విషయంలో న్యాయస్థానం చట్టం ప్రకారం విధించదగ్గ గరిష్ట శిక్షాకాలాన్ని విధించడాన్ని ప్రజలు న్యాయప్రక్రియలో భాగంగా చూడలేదు. కక్షసాధింపు రాజకీయంగానే పరిగణించారు. చివరకు అధికార పార్టీలోనే నేతలు సైతం ఇలా చేయకుండా ఉండాల్సింది అనుకున్నారు.సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 2019 ఏప్రిల్ 13న 'మోడీ' ఇంటి పేరుపై రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బ్యాంకులకు టోకరా వేసిన ఆర్థిక నేరగాళ్లు నీరవ్ మోడీ, లలిత్ మోడీలను ప్రస్తావిస్తూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లింకు చేస్తూ చేసిన ఈ వ్యాఖ్యలపై గుజరాత్‌కు చెందిన బీజేపీ నేత, శాసనసభ్యులు పూర్ణేష్ మోడీ సూరత్ కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసు విచారణకు రాహుల్ గాంధీ జులై 7న తొలిసారి స్వయంగా హాజరయ్యారు. ఆ తర్వాత కూడా హాజరైన సందర్భాలు ఉన్నాయి. తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు రాహుల్ గాంధీ ససేమిరా అన్నారు. మొత్తంగా న్యాయస్థానం రాహుల్ గాంధీని ఈ కేసులో దోషిగా తేల్చింది. ఇంతవరకు బాగానే ఉంది. 2023 మార్చి 23న న్యాయస్థానం ఆయనకు శిక్షను ఖరారు చేస్తూ.. పరువు నష్టం అభియోగంపై గరిష్టంగా విధించదగిన శిక్షాకాలం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఇది యావద్దేశాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. సూరత్ కోర్టు శిక్ష విధించిన మర్నాడే, అంటే మార్చి 24న లోక్‌సభ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసింది. అంతటితో ఊరుకోకుండా సభ్యత్వం కోల్పోయిన వెంటనే పార్లమెంట్ సభ్యుడి హోదాలో ఆయనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాల్సిందిగా నోటీసులిచ్చి మరీ ఖాళీ చేయించింది. ప్రజాప్రాతినిథ్య చట్టం ప్రకారం కనీసం రెండేళ్లు లేదా ఆపైన జైలు శిక్ష పడితే చట్ట సభల ప్రజాప్రతినిధులు తమ సభ్యత్వాన్ని కోల్పోతారు. అంతేకాదు, శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీచేయడానికి కూడా అనర్హులు అవుతారు. ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలే. కానీ రాహుల్ గాంధీ విషయంలో ఆఘమేఘాలపై చోటుచేసుకున్న పరిణామాలు మాత్రం జనబాహుళ్యంలో చాలామందికి రుచించలేదు. ఇదంతా అధికార పార్టీ కక్షసాధింపు చర్యగానే కనిపించింది.సాదాసీదా పరువునష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్షకు గురికావడం, ఆ వెంటనే పార్లమెంట్ సభ్యత్వం కోల్పోవడం, ప్రభుత్వ బంగ్లా ఖాళీ చేయాల్సి రావడం.. ఇవన్నీ చూస్తుంటే ఆయన్ను దురదృష్టం వెంటాడినట్టే కనిపించినా.. అన్నింటినీ రాహుల్ ఎదుర్కొన్న తీరు ఆయన పట్ల పార్టీలో, మిత్రపక్షాల్లో, ప్రజల్లో సానుకూలత తీసుకొచ్చింది. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సాగించిన భారత్ జోడో యాత్ర ద్వారా తనపై ఉన్న పాత ముద్రలు తొలగించుకుని, పరిణితిని ప్రదర్శిస్తూ వచ్చిన రాహుల్ గాంధీకి.. తాజా అనర్హత ఎపిసోడ్ మరింత బలాన్ని ఇచ్చింది. వ్యక్తి కేంద్రంగా సాగుతున్న నేటి రాజకీయాల్లో ప్రధాని మోదీని ఢీకొట్టే స్థాయిలో ప్రస్తుతం రాహుల్ గాంధీ తప్ప మరెవరూ కనిపించడం లేదు. ప్రధాని పదవి రేసులో బెంగాల్ సీఎం మమత బెనర్జీ, బిహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా తమ ప్రయత్నాలు సాగించినప్పటికీ.. దేశం నలుమూలల నుంచి ఆమోదం పొందగలిగే పరిస్థితి లేదని వారు గ్రహించారు. ఎంత బలహీనంగా ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ పార్టీకి దేశంలో ప్రతి రాష్ట్రంలో, ప్రతి మూలనా ఉనికి ఉంది. రాహుల్‌లో అంత పరిణితి లేదంటూ విమర్శించిన సొంత పార్టీ నేతలే ఇప్పుడు ఆయన అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తున్నారు. ఇక కార్యకర్తల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.జనంలోనూ రాహుల్ గాంధీకి మద్దతు రోజురోజుకూ పెరుగుతోందని కొన్ని ప్రైవేట్ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. ఓ సర్వే ప్రకారం 27 శాతం మంది రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడాలని కోరుకుంటున్నారు. గత సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే రాహుల్ బలం 4 పాయింట్లు పెరిగింది. 2014తో పోల్చితే ఏకంగా 13 పాయింట్లు పెరిగింది. ఈ సర్వేల్లో ప్రధాని మోదీపై ఆదరణ ఎక్కడా తగ్గినట్టు కనిపించలేదు. కాకపోతే బీజేపీయేతర ఓటర్లలో రాహుల్ ఆదరణ పెరిగిందని దీన్నిబట్టి అర్థమవుతోంది. ఒకప్పుడు మోదీకి ఏమాత్రం పోటీయే కాదన్న స్థాయిలో ఉన్న రాహుల్ గాంధీ, ఇప్పుడు సమవుజ్జీ స్థాయికి సమీపంలో ఉన్నారు. ఈ సర్వేలో తమ ప్రధానిగా మోదీయే ఉండాలని కోరుకుంటున్నవారిని.. మోదీకి ప్రత్యర్థి ఎవరు అని ప్రశ్నిస్తే.. 34 శాతం మంది రాహుల్ గాంధీ పేరు చెప్పగా, 11 శాతం మంది అరవింద్ కేజ్రీవాల్ పేరును, 5 శాతం మంది అఖిలేశ్ యాదవ్ పేరును, 4 శాతం మంది మమత బెనర్జీ పేరును ప్రస్తావించారు.మొదట్లో ప్రధాన మంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీని ససేమిరా అంగీకరించని ప్రతిపక్ష కూటమిలోని కొందరు నేతలు, ఇప్పుడు మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సైతం రాహుల్ ప్రధాని అభ్యర్థిగా తనకెలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. మరికొందరు నేతలు మాత్రం ప్రధాని అభ్యర్థి ఎవరన్నది ఇప్పుడు అప్రస్తుతమని, ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి గెలిచిన తర్వాత నిర్ణయించుకోవచ్చని అంటున్నారు. మిత్రపక్షంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. గతంతో రాహుల్ గ్రాఫ్ పెరిగిందన్నది నిర్వివాదాంశం

## క్విట్ ఇండియా దినోత్సవం మహాత్మాగాంధీకి నివాళులు

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు : క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నేతలు గాంధీభవన్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి వాళు లర్పించారు. తరువాత పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ జాతీయ జెండా ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఉపాధ్యక్షులు మల్లు రవి, నిరంజన్, వినోద్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, నాయకులు కోదండరెడ్డి, కుమార్ రావ్, బొల్లు కిషన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనా రెడ్డి, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, అనిల్ యాదవ్, మెట్టు సాయి కుమార్, సేవదల్ అధ్యక్షులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ఆసిఫాబాద్ -పభాత సూర్యుడు : మండలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంఘాల ఆ ధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసి దినోత్సవం పురస్క రించుకొని ఈ సందర్భంగా కొమురం భీం, కోటా భీంరావు,గేడాం రామారావు. విగ్రహాలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆదివాసీ జెండా ఎగురవేశారు. సిర్పూర్(యు), లింగాపూర్ మండ లంలోని అయా గ్రామాలల్లో బుధువారం ఆదివాసీ దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ గ్రామాలల్లో జెండా ఎగరవేశారు. లింగాపూర్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్కుమార్లు కుడిమెత విశ్వనాధారావు లుమాట్లాడాతు ప్రభుత్వ పథకాలు సద్వినియో గంకావలంటే అందరు చదువు కోవాలన్నారు. చదువుతోనే సమాజఅభివృద్ధి ముడిపడి ఉందన్నారు.



హాక్కుల సాధన కోసం పోరటలు చే యవాల్సిన అవసరం ఉందన్నారు. కుంరంభీంను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగవాల్సిన అవసరం ఉందన్నారు.కాంగ్రేస్పార్టి ఎస్టీసెల్ జిల్లా చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్రావు, ఆదివాసీ దినోత్సరం సందర్భంగా ఆదివాసీలకు ప్రత్యేక స్వయం పాలన రాష్ట్రం ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ చ ట్టాలను సంస్కృతిని పాఠ్యాంశాల్లో చేర్చాలి ఆదివాసీ చట్టాలు జీవోలు పటిష్టంగా అమలు చేయా లి. మణిపూర్ లో ఆదివాసి మహిళా పై దాడులు చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వేరే కులాలను చేర్పిస్తే ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శేషరావు, ఉపాధ్యాయుడు ఆత్రం ఆందర్రావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తోడసం ధర్మరావు. లింగాపూర్ బిఆర్ఎస్ నాయుకుడు ఆడే లక్యానాయక్, రమేష్. జాధవ్ గణపతి, బాపురావు, సర్పంచులు ఆత్రం వీణాబాయి. ఆర్క నాగోరావు.మెస్రం భూపతి, పెందోర్ నాగోరా వు.కాంగ్రెస్ పార్టీ నాయుకుడు ఆత్రం దౌవలర్రావు, ఆత్రం ధర్మరావు, గ్రామపటేల్లు పాల్గోన్నారు. తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు శేషునారాయణ, తదితరులు పాల్గోన్నారు.

## మామ తరపున బన్నీ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలను ప్రారంభించడానికి పెద్దవూర సమీపంలోని ముసలమ్మ చెట్టు వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో నిర్మించిన కార్యాలయం, ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించేందుకు అల్లు అర్జున్ వస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడుగా కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి కొనసాగుతున్నారు. కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి స్వగ్రామం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లి. అయితే కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు. 2014లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీపట్నం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆయన పోటీచేసి ఓడిపోయారు.తొలుత చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అనుచరుడుగా మిర్యాలగూడ కాంగ్రెస్ టికెట్ ఆశించారు. కానీ భాస్కర్ రావుకు టికెట్ దక్కడంతో పోటీ చేసే అవకాశం లభించలేదు. ఆ తర్వాత నల్గొండ ఎంపీగా పోటీ చేయాలని భావించారు. కానీ వేంరెడ్డి నర్సింహారెడ్డికి బీఆర్ఎస్ టికెట్ రావడంతో ఎంపిగా పోటీ చేసే ప్రయత్నాలు ఫలించలేదు. చివరి ప్రయత్నంగా ఈ ఎన్నికల్లో సాగర్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కంచర్ల ఫౌండేషన్ పేరుతో ఆయన పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజల్లోకి వెళ్లాలని ఆయన భావిస్తున్నారు.ముసలమ్మ చెట్టు వద్ద పది వేల మందితో సభ నిర్వహించేందుకు చంద్రశేఖర్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ కార్యకర్తలు, చంద్రశేఖర్ రెడ్డి అనుచరులు, అల్లు అర్జున్ అభిమానులకు ఇక్కడే భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.తమ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్న మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి తరఫున అల్లు అర్జున్ ప్రచారం చేయనున్నారు. నాగార్జునసాగర్ టికెట్ తనకు ఇవ్వాలంటూ పలుమార్లు సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్‌ను కలిసి చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. చంద్రశేఖర్ రెడ్డి పోటికి సంబంధించి బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎలాంటి సంకేతాలు రాలేదు. పార్టీతో సంబంధం లేకుండా మామ తరపున ఎన్నికల ప్రచారం చేసేందుకు అల్లు అర్జున్ అంగీకరించారట.

# ఈ నెలాఖరుకే.. అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ కూడా తెలంగాణకు తామేం చేశామో చాటుకునేందుకు యధాశక్తి ప్రయత్నిస్తోంది. ఇటీవల వరంగల్ సభకు వచ్చిన ప్రధాని మోదీ గత 9 ఏళ్ళలో తెలంగాణకు తమ ప్రభుత్వం చేసిన ప్రయోజనాలను వివరించారు. రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రెండ్రోజుల క్రితం తెలంగాణలో 21 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ప్రజలకు మేళ్ళు చేస్తూ వారిని మచ్చిక చేసుకుంటున్న రాజకీయ పార్టీలు తాజాగా గెలుపు గుర్రాల ఎంపికపై దృష్టి సారించాయి.2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్ళి విపక్షాలకు ప్రిపరేషన్ టైం లేకుండా చేసి.. ఘన విజయం సాధించిన కేసీఆర్ అభ్యర్థుల ఎంపిక కోసం ఓవైపు ఇంటలిజెన్స్ నివేదికలను తెప్పించుకుంటూనే ప్రయివేటు సర్వే సంస్థల నివేదికలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు చెందిన ఐ-ప్యాక్ బృందంతో ఇదివరకే రెండు సార్లు సర్వే చేయించినట్లుగా తెలుస్తోంది. ఆయన లిస్టులో నెగెటివ్ రిపోర్టు వచ్చిన వారికి ఇదివరకే కేసీఆర్ వార్నింగ్ ఇచ్చారు. ఆ తర్వాత మూడు నెలల వ్యవధిలో మరోసారి ఐ-ప్యాక్ టీమ్ సర్వే జరిపి కేసీఆర్‌కు రిపోర్టిచ్చింది. తాజా రిపోర్టులో నెగెటివ్ వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ షాకిస్తారని తాజాగా ప్రచారం జరుగుతోంది. ఆగస్టు నెలాఖరు నాటికే సగానికిపైగా అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తారని తెలుస్తోంది. అధిక మాసం కావడంతో కేసీఆర్ సెంటిమెంటు పరంగా కొంత ఆలోచిస్తున్నారని, లేకపోతే ఆగస్టు 12 లేదా 13 తేదీలలోనే ఏకంగా 87 సీట్లకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించే వారని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అధిక మాసంలో ఎందుకనుకుంటే మాత్రం ఆగస్టు 17 తర్వాత ఏ క్షణమైనా బీఆర్ఎస్ అభ్యర్థులను కేసీఆర్ ప్రకటిస్తారని సమాచారం.

అయితే, ఈ జాబితాలో సిట్టింగులందరికీ ఛాన్సిస్తారా లేక కొందరికి మొండిచేయి చూపుతారా అన్న ఆసక్తి రేపుతోంది. సిట్టింగుల్లో ఎవరికైనా టిక్కెట్ దక్కకుంటే వారు ప్రత్యర్థి పార్టీల వైపు చూసే అవకాశాలుండడంతో వారితో ముందుగానే ఓ మాట చెప్పడం ద్వారా వారి భవిష్యత్‌పై భరోసా కల్పించాలని కూడా కేసీఆర్ అనుకుంటున్నట్లు తెలుస్తోంది. 2018లో అనూహ్య నిర్ణయంతో ముందస్తుకు వెళ్ళిన కేసీఆర్? ఎన్నికలకు చాలా ముందుగానే అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. సెప్టెంబర్ నెలలోనే అభ్యర్థులను ప్రకటించి.. గ్రౌండ్ వర్క్ చేసుకోమని వారికి చెప్పారు. తెలంగాణలో 119 సీట్లుండగా ఎన్నికలకు మూడు నెలల ముందుగానే ఏకంగా 105 సీట్లకు అభ్యర్థులను ప్రకటించేశారు ఆనాడు. తాజాగా 80 నుంచి 87 సీట్లకు అభ్యర్థుల జాబితాను కేసీఆర్ ఖరారు చేసినట్లు సమాచారం. ఆగస్టు మూడో వారం కల్లా జాబితాను వెల్లడిస్తారని ప్రచారం జరుగుతోంది.ఇక కర్నాటక ఫలితాల తర్వాత దూకుడు పెంచిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు కూడా అభ్యర్థుల జాబితాపై కసరత్తు ముమ్మరం చేశారు. అయితే అంతర్గత ప్రజాస్వామ్యం కొద్దిగా ఎక్కువ పాళ్ళలో వుండే కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థులను ముందస్తుగా ప్రకటిస్తే వచ్చే కష్టనష్టాలను పార్టీ రాష్ట్ర వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఏఐసీసీ బృందం అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఎన్నికల కమిటీలో ఏకాభిప్రాయం కుదిరిన 35 నుంచి 40 మందితో ఆగస్టు చివరి వారంలో అభ్యర్థుల జాబితాను విడుదల చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సంసిద్ధమవుతున్నది. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా అనుసరించిన వ్యూహాన్నే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోను అనుసరించనున్నట్లు తెలుస్తోంది. సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇదివరకే ప్రకటించారు. తన ఎంపిక కూడా సర్వే రిపోర్టు ఆధారంగానే జరుగుతందని రేవంత్ చెప్పడం కొంత అతిశయోక్తే అయినా ఆ పార్టీ సర్వేలనే నమ్ముకుంటోందని ఆయన మాటల ద్వారా తెలుస్తోంది. ఇక ఇంకోవైపు బీజేపీ కూడా 30 నుంచి 40 సీట్లకు అభ్యర్థులను ముందే ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఎన్నికల కమిటీ ఛైర్మెన్ ఈటల రాజేందర్‌ని ఆగస్టు 8న బీజేపీ అధిష్టానం ఢిల్లీకి పిలిపించుకుంది. రాష్ట్ర స్థాయిలో ఎన్నికల కమిటీని ఇటీవలనే బీజేపీ నియమించుకుంది. అయితే, టీ.బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, ఇటీవల బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందిన బండి సంజయ్ కుమార్, ఎన్నికల కమిటీ సారథి ఈటల రాజేందర్, బీజేపీ ఓబీసీ సెల్ ఛైర్మెన్ డా. కే.లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డి.కే. అరుణల మధ్య ఏకాభిప్రాయం కుదిరిన అభ్యర్థుల పేర్లతో ముందుగానే జాబితాను ప్రకటిస్తే ఎలాంటి సమస్య వుండదని బీజేపీ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ కుదిరితే బీజేపీ అభ్యర్థుల జాబితా కూడా ఆగస్టు నెలాఖరుకే వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఐఐటీలో ఆగని ఆత్మహత్యలు

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం హాస్టల్‌లోని తన గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని విగత జీవిగా కనిపింపించింది.ఒరియా భాషలో తన చావుకు ఎవరూ కాదని, చదువు విషయంలో ఒత్తిడికి గురవుతున్నట్లు సూసైడ్ లెటర్ రాసి బలవణ్మరణానికి పాల్పడింది. హాస్టల్ సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ .. మమైత ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రెండు వారాల క్రితమే విద్యార్థి క్యాంపస్‌లో చేరిందని, జూలై 26న క్యాంపస్‌కు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థిని మృతదేహాన్ని సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. చదువులో ఒత్తిడి తట్టుకోలేకే చనిపోతున్నానని మమైతా సూసైడ్ నోట్‌లో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఇప్పటివరకు ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని తనువు చాలించారు. తాజాగా మరో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడటంతో.. విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. 2022-23 ఏడాది వ్యవధిలోనే నలుగురు ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. చదువులు చదవలేక, ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు తనువుచాలిస్తున్నారు. పరీక్షల్లో ఫెయిల్ అవ్వడం, చిన్న సమస్యలకే డిప్రెషన్‌లోకి వెళ్లిపోయి దారుణ నిర్ణయాలు తీసుకుంటున్నారు.హైదరాబాద్ ఐఐటీలో ఆత్మహత్యలు ఆగడం లేదు. దాదాపు ఏడాదిలో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. గతేడాది ఆగస్టు 31న ఏపీ నంద్యాల జిల్లాకు చెందిన విద్యార్థి రాహుల్ మంచానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే ఏడాది సెప్టెంబర్ 6న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కి చెందిన ఐఐటీ పూర్వ విద్యార్థి మేగ్ కపూర్ సంగారెడ్డిలో ఓ హోటల్‌పై నుంచి కిందికి దూకి బలన్మరణానికి పాల్పడ్డాడు. జులై 17వ తేదీన క్యాంపస్ నుంచి బయటికి వెళ్లిన నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన కార్తీక్ వైజాగ్‌లో శవమై తేలాడు. మంగళవారం ఒడిశాకు చెందిన మమైతా నాయక్ క్యాంపస్ హాస్టల్ రూమ్‌లో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.ఐఐటీ హైదరాబాద్‌లో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు తల్లిదండ్రుల్లో గుబులురేపుతున్నాయి. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లోనే విద్యార్థులు వరుసగా బలన్మరణాలకు పాల్పడుతున్నారని, తమ పిల్లల భవిష్యత్తు ఏమౌతుందోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐఐటీ అధికారులు సైతం ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించేలా క్యాంపస్‌లో యాజమాన్యం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసింది. విద్యార్థుల సమస్యలు, ఒత్తిడికి కారణాలు తెలుసుకుని వారికి చికిత్స, కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.

# వైద్య ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట

**-నూతన 108 వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



- పచ్చ జెండా ఊపి నూతన 108 వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తదితరులు.
- త్వరలో ప్రారంభించనున్న డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కిషన్ రెడ్డి

ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం వైద్య ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మంజూరు చేసిన ఐదు నూతన 108 అంబులెన్స్ వాహనాలను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ..పేద ప్రజలకు మెరుగైన 1 వైద్య సేవలు అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగా వైద్య సేవలు శరవేగంగా అందించడానికి 108 అంబులెన్స్ వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభించనున్న డయాలసిస్ సెంటర్ ను పరిశీలించారు.

# కేసీఆర్ చిత్రపటానికి రేషన్ డీలర్ల పాలాభిషేకం



ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రేషన్ డీలర్లతో కలిసి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు : రేషన్ డీలర్ల కమిషన్లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నియోజకవర్గం లోని రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో రేషన్ డీలర్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల కమిషన్లు పెంచినందుకుగాను ఎమ్మెల్యే కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడక ముందు రేషన్ డీలర్ల కమిషన్ టన్నుకు కేవలం 200 మాత్రమే ఉండేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో డీలర్ల కమిషన్లు క్రమేణ పెంచుతూ వచ్చిందనితెలిపారు. కానీ ఇప్పుడు రేషన్ డీలర్ల కష్టాలను దృష్టిలో పెట్టుకొని టన్ను బియ్యానికి ఏకంగా 900 నుండి 1400 రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసిఎస్ చైర్మన్ పుల్లా రెడ్డి, నాయకులు రమేష్ గౌడ్, చక్రవర్తి గౌడ్, సర్పంచ్ కిరణ్, మండలాల రేషన్ డీలర్ల ప్రెసిడెంట్లు పి.యాదయ్య, వై.భానుచందర్ గౌడ్, ఎల్.మాధవ రెడ్డి, ఏ.రాజు గౌడ్, డీలర్లు ఎం.నవీన్, నాయుకులు రమేష్ గౌడ్, జాంగా రెడ్డి, అమరెందర్ రెడ్డి, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూముల క్రమబద్ధీకరణ రుసుం వసూలుకు కార్యాచరణ



పెద్దపల్లి -ప్రభాత సూర్యుడు :ప్రభుత్వ ఉత్తర్వు 59 క్రింద భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి నిర్దేశించిన రుసుము వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ లోని వీసి హాల్ లో జీఓ 59 భూముల క్రమబద్ధీకరణ, ఇంటి పట్టాల పంపిణీ, గృహలక్ష్మి పథకం వంటి అంశాల పై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ తో కలిసి తహసిల్దార్లతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారు లతో మాట్లాడుతూ మొదటి దశలో మన జిల్లాలో క్రమబద్ధీకరణ కోసం 664 మంది దరఖాస్తు దారులలో ఇప్పటివరకు 27 మంది మాత్రమే పూర్తిగా నిర్దేశించిన రుసుము చెల్లించి క్రమబద్ధీక రణ చేసుకున్నారని, 10 మంది వరకు మొదటి, రెండు విడతల చెల్లింపు చేశారని, 627 మంది దరఖాస్తు దారులు రుసుము చెల్లింపు ప్రక్రియ ప్రారంభించ లేదని, ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి నిర్దేశించిన రుసుము వసూలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 59 క్రింద రెండవ విడతలో వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని, ఆ సమయంలోనే రుసుము చెల్లింపు ప్రక్రియ గురించి లబ్ధిదారులకు వివరించా లని, అలాగే ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ 10 వరకు గృహలక్ష్మి పథకం క్రింద దరఖాస్తు స్వీకరించేందుకు ప్రభుత్వం గడువు నిర్దేశించిందని కలెక్టర్ తెలిపా రు. మండలాల పరిధిలోని ప్రజాప్రతి నిధులతో సమన్వయం చేసుకుంటూ గృహలక్ష్మి పథకం దరఖాస్తు అంశం విస్తృతంగా ప్రజలకు చేరేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. గృహలక్ష్మి పథకం క్రింద జిల్లాలో ప్రతి తహసిల్దార్ కార్యాల యం, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖా స్తులు స్వీకరించాలని తెలిపారు. పాలకుర్తి మండలంలోని ఎసాల తక్కలపల్లి, మంథని మండలంలోని ఏక్లాస్ పూర్, సుల్తానాబాద్ మండలంలోని రెబ్బదేవపల్లి, శ్రీరాంపూర్ మండలం లోని తారుపల్లి గ్రామాల్లో బలహీనవర్గా లకు ఇంటి స్థలాల పంపిణీ కోసం 11 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, వీటిని 442 ప్లాట్లుగా విభజించామని, 132 ప్లాట్ల ఇంటి పట్టాలను లబ్దిదారులకు పంపిణీ చేశామని, పెండింగ్ లో ఉన్న ఇంటి పట్టాల పంపిణీ కోసం బలహీన వర్గాల నుంచి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పంపిణీ పూర్తయ్యే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావే శంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి మధుమోహన్, కలెక్టరెట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ - సెక్షన్ సూపరిం టెండెంట్ పుష్పలత, తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా శోభారాణి నియామకం



జగిత్యాల -ప్రభాత సూర్యుడు : మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా తాటిపర్తి శోభారాణి ని నియామకం చేసినట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావు తెలిపారు.మహిళా కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు పాటుపడాలని శోభారాణి కి ఆమే సూచించారు.ఈ మేరకు సునీత రావు ఉత్తర్వులు జారీ చేశారు.జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికేపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ తాటిపర్తి శోభారాణి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పాల్గొంటు పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్న నేపథ్యంలో ఆమెను ఈ పదవిలో నియమించినట్లు సునీతరావు తెలిపారు.శోభారాణి 1995 లో పెగడపల్లి జెడ్పిటిసి కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి గెలుపొందారు.2019 లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బతికేపల్లి సర్పంచ్ గా శోభారాణి గెలుపొందారు.కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో శోభారాణి చురుకుగా పాల్గొంటు జగిత్యాల జిల్లాలో పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న క్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించారు.ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ నాపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని అలాగే మహిళా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.శోభారాణి నియామకం పట్ల పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, మహిళా, యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వాసుపత్రిలో శిశువుల తారుమారు

**:కథ సుఖాంతం**

మహబూబాబాద్ -ప్రభాత సూర్యుడు : మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రి లో శిశువులు తారు మారు కావడం కలకలం సృష్టించింది. ఎస్.ఎన్.సి.యు సిబ్బంది సుమిత్ర బాబు ను సునిత కు అప్పగించారు.గంట తర్వాత సుమిత్ర కుటుంబ సభ్యులు గుర్తించి వైద్య సిబ్బంది తో వాగ్వాదానికి దిగారు. జరిగిన తప్పు ను వైద్య సిబ్బంది తెలుసుకొని సునిత దగ్గరి బాబును సుమిత్ర కు అప్పగించి మరోసారి ఈ విధంగా జరగకుండా చూస్తామని హామీని ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన భూక్య సుమిత్రకు జూలై 31వ తేదీన మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి అయింది. పండంటి బాబుకు జన్మనిచ్చింది. బాబు కు పసరికలు కావడంతో ఎస్.ఎన్.సి.యు లోని బాక్స్ లో ఉంచారు. కేసముద్రం మండలం దస్రు తండా చెందిన సునిత ఈ నెల 4 వ తేదీన ప్రసూతి కాగా పాపకు జన్మనిచ్చింది. పాప కు శ్వాస సరిగా ఆడకపోవడం తో ఎస్.ఎన్. సి.యు లోని బాక్స్ లో ఉంచారు. బాబు కు ఫీడింగ్ ఇవ్వడం కోసం ఎస్.ఎన్.సి.యు లో నుండి సుమిత్ర బాబు ను సునిత కు ఇచ్చారు. బాబు ని తీసుకున్న సునిత కుటుంబ సభ్యులు వార్డుకు వచ్చారు. కొంత సమయం తర్వాత వార్డు లోని కొంత మంది మీకు పాప పుట్టింది కదా, బాబు ఎక్కడ నుండి వచ్చాడు అని ప్రశ్నించారు. ఈ విధంగా ప్రశ్నిస్తున్న సమయంలో సునిత వద్ద ఉన్న బాబు ను అమ్మమ్మ చూసి బాబు కు ఉన్న కాటుక బొట్టును నేనే పెట్టిన.. ఇతడు మా బాబే మీ దగ్గరికి ఎలా వచ్చాడు అని వారితో, సిబ్బంది తో వాగ్వాదానికి దిగింది. దీంతో తప్పును తెలుసుకున్న సిబ్బంది బాబును సుమిత్రకు అప్పగించారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామని హామీని ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమనిగింది. విషయం తెలుసుకున్న బ్లూ కోట్స్ సిబ్బంది వెంటనే హాస్పిటల్ కు చేరుకుని విచారణ చేపట్టారు.

## గద్దర్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ఎంపీపీ



కమాన్ పూర్ - ప్రభాత సూర్యుడు : గద్దర్ మృతి పట్ల రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ప్రజా వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో తన పాటద్వారా పల్లె పల్లెనా భావజాలవ్యాప్తి చేసిన గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) రామగిరి మండల ఎంపీపీ ఆరెల్లి దేవక్క-కొమురయ్య గౌడ్ తీవ్రగ్భ్రాంతి చెందారు. వారి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ కోసం తన ఆట పాటలతో ప్రజల్లో స్వరాష్ట్ర చైతన్యాన్ని రగిలించిన గద్దర్ ప్రజాయుద్ధనౌకగా ప్రజల హృదయాల్లో,ప్రజలకోసం తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసి ప్రజలకోసమే బతికాడని తెలిపారు. సాధారణ బుర్రకథ కళాకారుడుగా ప్రారంభమైన గద్దర్ కళాజీవితం, విప్లవ రాజకీయాలతో మమేకమై, అనంతర కాలంలో తెలంగాణ సాధన కోసం సాగిన ఉద్యమంలో సాంస్కృతిక పోరాటంలో ఉన్నతస్థాయికి చేరిందన్నారు. కవిగా గద్దర్ ప్రజా కళలకు, ఉద్యమాలకు చేసిన సేవలుమరుపురానివని, వారు లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. ప్రజా కళాకారులకు కవులకు మరణం ఉండదని, ప్రజాకళలు వర్ధిల్లినంతకాలం ఆయన పేరు అజరామరంగా నిలిచి ఉంటుందని తెలిపారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ఆరెల్లి దేవక్క-కొమురయ్య గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



కమాన్ పూర్ - ప్రభాత సూర్యుడు : కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామంలో బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి జూలపల్లి సర్పంచ్ బొల్లేపల్లి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. జూలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎలా బోయిన లావణ్య కి అందజేయడం జరిగింది. కాగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూర అయింది. దీంతో లబ్ధిదారునికి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి సర్పంచ్ బోల్లపల్లి శంకర్ గౌడ్ , బీ ఆర్ఎస్ కమాన్ పూర్ మండల అధ్యక్షులు కిషన్ రెడ్డి ,ఉపసర్పంచ్ పోలు దాసరి సాయికుమార్ మండల టిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గ ఏఎంసి వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మ మల్లుగడప కృష్ణమూర్తి , టిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు మెరుగు వెంకటేశ్వర్లు, కంది మల్లేష్ , దామెర సంపత్, టిఆర్ఎస్ నాయకులు రాచకొండ రవి ఎలా బోయిన రామ్మూర్తి, ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఐఐడి హైదరాబాద్ లో విద్యార్థిని ఆత్మహత్య

సంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ లో మరోసారి విషాదం నెలకొంది. క్యాంపస్ లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. క్యాంపస్ రూమ్ లో విద్యార్థిని మమైతా నాయక్ (21) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి కార్తీక్ సూసైడ్ ఘటన మరువక ముందే మరో ఘటన జరిగింది. గత నెల 17 న కార్తీక్ విశాఖపట్నం బీచ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏడాది వ్యవధిలో నలుగురు ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే మొదటిసారి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. నా చావుకు ఎవరూ కారణం కాదు. మానసిక ఒత్తిడికి గురవుతున్నానని మృతురాలు లేఖ రాసినట్లు సమాచారం.

## సైబర్ క్రైమ్, షీ టీంపై అవగాహన సదస్సులు అవసరం

**ఎస్సై మహేందర్**




పెద్దపల్లి -ప్రభాత సూర్యుడు : సైబర్ క్రైమ్, షీ టీం పై అవగాహన సదస్సులు ఎంతో అవసరమని ఎస్సై మహేందర్ తెలిపారు. స్థానిక గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో షీ టీం, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ విద్యార్థులు నేటి యువత చాలామంది మొబైల్ ఫోన్ వాడుతున్నారని ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇంస్టాగ్రామ్ మెసేజ్ చాటింగ్, ఫోటో షేర్ చేయడం జరుగుతుందని, వీటిని ఆసరాగా చేసుకొని అనేకమంది సైబర్ నేరగాళ్ళు ఫొటోల మార్ఫింగ్ చేయడం అనేకరకాలుగా మహిళలను ఫ్రెండ్షిప్ పేరుతో మోసం చేయడం వేధించడం ఎలా జరుగుతున్నాయో వివరించారు. వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్య ఎదురైనప్పుడు తమను సంప్రదించాలని, సైబర్ క్రైమ్ 100 డయల్ చేయాలని తెలిపారు. అలాగే షీ టీమ్ ఇంచార్జ్ శ్రీలత పోకిరిల నుండి ఎదురయ్య సమస్యలను షీ టీం ద్వారా పరిష్కరించుకోవాలని షి టీం 1930 డయల్ చేసి పరిష్కరించుకోవచ్చని సూచనలు చేశారు. కళాశాల కరస్పాండెంట్ అల్లెం కి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థు లు ఎలాంటి చెడు వ్యసనాలకు లోను కాకూడదని ఎలాంటి మోసాలకు పాల్పడకూడదని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.రవీందర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215